# వఱడు

రాత్రి పది గంటలు కావస్తోంది. ఆ కీకారణ్యమంతటా, పేరుకున్న నల్లటి తారు ముద్దలాంటి చీకటి అలుముకునుంది. కేంపు గుడారాలు మాత్రం తెల్లతెల్లగా కనిపిస్తున్నాయ్. మధ్యలో అక్కడక్కడ కేంపు పనివాళ్ళు వన్య మృగాల బారినుండి రక్షించుకోడానికివేసిన మంటలు, దూరాన్నుంచి కొరివిదెయ్యాల్లా కన్పిస్తున్నాయ్. గుడారాల్లో హరికెన్ లాంతర్లు మిణుకు మిణుకు మంటూంటే, ఆఫీసు టెంటులో పెట్రోమాక్సు లైటు వెలిగిపోతోంది. దశరథ రామయ్య గారు ఇంకా ఆఫీసు పని చేసుకుంటున్నారు. అలా రాత్రి ఒంటి గంటవరకూ ప్రతిరోజూ పనిచెయ్యడం ఆయనకి పరిపాటే.

చిమ్మెట్టలు ''జుయ్'' మని చేసే శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది. ఎక్కడో దూరంగా కొండల్లో కొండగొర్రె అవిరామంగా ''కార్ కార్'' మని అరుస్తోంది. దశరథ రామయ్య గారికి చిన్న దగ్గు తెర వచ్చింది. కాసేపు గొంతుకలో కఫం తెగేదాక దగ్గి, గుండెని చేత్తో పట్టుకుని టెంటు తెర తొలగించి బైట కొచ్చి తుపుక్కున ఉమ్మాడు. ఆయాసం కాస్త తేలికపడిన తరవాత, ఇహ ఇవాల్టికి ఇంటికి పోదామనుకున్నాడు. --కానీ ఇంకా బోలెడు పనుండి పోయింది. ఐనా ఇప్పుడు టైము ఎంత అయుంటుందో అని చిన్నయ్య గుడారం వైపు చూశాడు.

జీపుడ్రయివరు చిన్నయ్య హెడ్ క్వార్టర్సులో వుంటే, సరిగ్గా రాత్రి పన్నెండు గంటలకు ఎన్ని పనులున్నా లైటార్పేసి పడుకుంటాడు. అది అతని ఎక్సు మిలిటరీ డిసిప్లేన్ అంటాడు.

ఇంకా లాంతరు గుడారంలో వెలుగుతోంది. అంటే పన్నెండు కాలేదన్నమాట. సరే, మరో గంటపని చేసి పోదామని టెంటులోకి దశరథరామయ్య గారు దూరుతూండగా ''టకాలు'' మని బూట్లు కొట్టుకున్న చప్పుడు. వెంటనే ''గుడ్‌నైట్ పంతులు బాబూ'' అనే అరుపు కూడా వినిపించింది. అకస్మాత్తుగా మిలిట్రీ కాషన్ లాంటి అరుపు వినపడగానే ఉలిక్కిపడినా , అది చిన్నయ్య కేకే అని పోల్చేసుకున్నాడు. '' ఆఁ, రావయ్యా. ఇంకా నిద్రపోలా?'' అని పలకరించాడు. తన గుడారం ముందు అటెన్షన్ పొజులో సెల్యూట్ చేస్తూ నిలబడ్డాడు చిన్నయ్య. ''రాత్రుళ్ళు కూడా నీ మిలిట్రీ సెల్యూట్లేనా? మిలిట్రీ ఒదిలేసినా, ఇంకా ఆ డ్రెస్సులూ వీశడు బరువు బూట్లూ, మిలిట్రీ సెల్యూట్లూ మానవు గదా:... రావయ్యా!... భోంచేశావా?'' అనడిగాడు దశరథరామయ్య.

''ఇప్పుడే అయింది బాబూ, చుట్ట కాల్చుకుందామని బైటికొచ్చాను. మీరింకా పనిచేస్తు న్నారా? అసలే మీ హెల్తు మంచిది కాదు. ఉబ్బసపోళ్ళు. ఈ చలికాలం ఇంతవరకూ పని చేస్తే ఒళ్ళు పాడె పోతాది, ఇంటికెల్లి పడుకోండి. బాబూ, అమ్మగారొక్కరూ బితుకుబితుకు మంటుంటారు.''

''అప్పుడే ఎక్కడయ్యా? ఇంకా నన్ను తగలెట్టినంత పనుంది. ఒంట్లో బాగాలేదని పనిచేయడం మానేస్తే ఊరుకుంటారా? అందులోనూ రిటైరైనవాడ్ని. కనికరించి తిరిగి వేసుకున్నారు. సరిగా పని చెయ్యకపోతే పీకిపారెయ్యరూ......

''బాబూ! ఇప్పుడు మీకు అరవై దాటుంటాయనుకుంటాను. ఇంకా ఎన్నాళ్ళిలాకష్టపడతారు?''

'' చచ్చేవరకూ........ ! తప్పదు చిన్నయ్యా, చావకుండా బతికుండాలంటే చచ్చేదాక పని

చెయ్యక తప్పదు. లేకపోతే నాకూ నాపెళ్ళానికి ముద్ద ఎలా గడుస్తుంది? ఊళ్లో చదువుకుంటున్న నా కొడుకును ఎవరు చూస్తారు?'' అని బరువుగా భయంగా నవ్వి టెంటులోకిపోయి కళ్లు తుడుచు కుంటూ కాయితాల ముందు తిరిగి కూర్చున్నాడు దశరథరామయ్య. కంట్రాక్టరు బిల్లులోని వేలు, లక్షల రూపాయలు అతని కళ్ళకు గజిబిజిగా కనిపించాయి.

''ఏఁవిటో, పంతులు బ్రతుకు!'' అంటూ సానుభూతిగా పెదవి విడిచి చుట్ట కాల్చుకోవడానికి మంట దగ్గరకు నడిచాడు చిన్నయ్య. మంచు బాగా కురుస్తూండడం వల్ల మంటలు సన్నగిల్లి పోతున్నాయి. పనస చెట్టు మీదనుండి ఉండుండి మంచుబొట్లు మంటల మీద పడి సుంయ్ సుంయ్ మంటున్నాయి. నీరసించిపోతున్న మంటని బూటుతో తన్ని ఎగదోశాడు చిన్నయ్య. చిటపట మంటూ నిప్పురవ్వలు ఉవ్వెత్తున లేచాయి. పక్కనున్న ఎండుపుల్లల్ని, ఆకుల్ని ఏరితెచ్చి, మంటలో పడేసి రెండు సార్లు మళ్ళా బూటుతో తన్ని ఎగదోశాడు. పనసచెట్టు మొదల్లో కూర్చుని చుట్ట తీసి, మంటలోనుంచి ఒక కొరకంచు పుల్లతీసి వెలిగించుకున్నాడు చుట్ట. భగ్ భగ్‌మని చుట్ట పొగ వదుల్తూ సెగ కాచుకుంటున్నాడు. ఫళఫళమంటూ ఎత్తుగా లేస్తున్న మంటలకి అందుబాట్లో నున్న పనస ఆకులు మాడిపోతున్నాయి.

ఉండుండి కొండగొర్రె అరుస్తూనే ఉంది, కొండల్లో నుండి. పొగ వాసనతో నిండిపోయింది ఆ ప్రాంతమంతా . గాలేసినప్పుడల్లా చెట్టుకి పండిన బురద పనస మత్తు వాసనల్ని గుబాళిస్తోంది. ఉండుండి....... మంటల్లోని నిప్పులు ఛట్ ఛట్‌మని పేలుతున్నాయి.

చిన్నయ్య తన ఎడంవైపు టెంటులోకి చూశాడు, ఎవరైనా మేలుకునున్నారేమోనని. అది దశరథరామయ్య కుటుంబం ఉండే టెంటు. లైటుబాగా దించేసుంది. ''పంతులమ్మగారు పడుకు నుంటారు ఫరవాలేదు'' అని చుట్ట పారేసి మెల్లగా జేబులోంచి సీసా తీశాడు. గ్రైప్ వాటర్ సీసాలో పోసి తెచ్చుకున్న నాటు సారాని డగ్‌డగ్ మని రెండు గుటకలు మింగాడు. అసహ్యంగా ''బ్రేవు'' మని తేన్చుకుంటూ సీసావైపు చూశాడు. మీసాలకి అంటుకున్న సారా బొట్టుని కాసేపు అనుమానం గా నాలికతో చప్పరించాడు. పరీక్షగా రెండు మూడు సార్లు బుడ్డీలో సరుకుని వాసన చూసి, మిగతా సీసాని మరి రెండు గుక్కల్లో గబగబా ఖాళీ చేసి, కాండ్రించి ఎదురుగా వున్న మంటల్లోకి తుపుక్కున ఉమ్మాడు.

''చత్! చప్పగా ఉంది'' అని విసుక్కుంటూ, సీసా అడుగుని మిగిలున్న అయిదారు చుక్కల్నీ నిప్పులమీదికి జాడించాడు. అవి సుంయ్ సుంయ్ మని వెలిగి ఆరిపోయాయి.

''దొంగ నాయాలగాడు నీరు కలిపేశాడు, ఈ ''సివిలు'' నా కొడుకులింతే. కల్తీ లేకుండా.... ఏసరుకూ అమ్మరుగదా! మిలిట్రీ వోళ్ళకి ఆర్డరిచ్చేస్తేనా, ఇలాటోళ్ళని ఫైర్ చేసి పారేస్తారు...... అబ్బే కొంచమైనా ఫోర్సు ఎక్కలేదు........ దొంగ నాయాలగాడు'' అంటూ ఖాళీ సీసాని వెనకాల తుప్పల్లోకి విసిరేసి, కాళ్ళు రెండూ... మంటలవైపు చాచి డిజప్పాయింటెడ్‌గా పనస చెట్టు మొదలుకి చారగిలబడి పోయి మరో చుట్ట వెలిగించాడు చిన్నయ్య. చెమట పట్టిన తన మొహం, మంట వెలుగులో ఎర్రగా కందగడ్డలా కనిపిస్తోంది.

చిన్నయ్య అసలు పేరు ఆ కేంపులో చాలా తక్కువ మందికి తెలుసును. అంతా ''మిలట్రీ మాన్'' అని పిలుస్తారు. అది విని మురిసిపోతాడు చిన్నయ్య. రెండవ ప్రపంచ యుద్ధంలో పనిచేసి

పించను పుచ్చుకున్నాడు. తరువాత అస్సాం నూనె గనుల్లో కొన్నాళ్ళు పని చేశాడు. ప్రస్తుతం టెంప రరీ జీపుడ్రయివరుగా కేంపు నెంబరు ఫోర్ అసిస్టెంటు ఇంజనీరు దగ్గర పనిచేస్తున్నాడు. అతనికి మిలిట్రీ అంటే ఎనలేని భక్తి శ్రద్ధలు, మనిషంటే మిలిట్రీ వాడే మనిషి అంటాడు. మిగతావాళ్ళు ''సివిలోళ్ళు'' అని చులకనగా చూస్తాడు. మిలిట్రీ వాళ్ళు తమ దేశం కోసం ఫైట్ చేస్తే, సివిలోళ్ళు పొట్టకోసం దేవిరిస్తారంటాడు. మిలిట్రీ వాళ్ళు నిస్వార్థంగా పనిచేసే నీతి నిజాయితీ గల ''సీదా ఆద్మీ'' లని సివిలోళ్ళు ''బద్మాష్ ఆద్మీ'' లనీ ఏదో థీసిస్ చెప్తాడు.

తుపాను పట్టినా సరే, ఆ వయసులో తెల్లవారు జామున నాలుగ్గంటలకే లేచిపోయి కసరత్తు చేస్తాడు. ఆ రోగంటకల్లా స్నానం చెయ్యడం, బూట్లు పాలిష్ చేసుకోవడం మీసాలకు రంగెక్కించు కోవడం పూర్తి చేసుకుని, నాస్తాచేసి మగ్గుడు టీ తాగి, ఆరున్నరకి ఠంచనుగా ఇంజనీరుగారి దగ్గరికి హాజరవుతాడు. వెళ్ళే ముందు జార్జి చక్రవర్తి, సుబాసుబోసు పటాలకి, ఠకాలుమని బూట్లుకొట్టి అటెన్షన్ ఫోజులో సెల్యూట్ చెయ్యనిదే బయల్దేరడు.

మంట కాంతిలో దగ్గర్లో వున్న తుప్పలు, పనస చెట్టు సగం భాగం, పది పన్నెండు గజాల లోపుగా వున్న చెట్ల మొదళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. పనస చెట్టు నీడపడుతూండడం వల్ల దానికి కాస్త వెనకాల ఎడమ వైపుగా వున్న పంతులుగారి టెంటు మసగ్గా కనిపిస్తోంది. చుట్టూ చిక్కని చీకటి అల్లుకునుంది. చిన్నయ్య మంటకి దగ్గర్లో ఉండడం వల్ల ఆ వెలుతురుకి అలవడ్డ కళ్ళకి చుట్టూ వున్న చీకటి మరింత దట్టంగా కనిపిస్తోంది. చిన్నయ్య ఏమీ తోచక మంటల్లోకీ, చుట్టూ ఆవరించుకున్న కటిక చీకట్లోకి, దూరంగా కొండలమీద కాలుతున్న అడవుల్లోకి చూస్తూ చుట్టమీద చుట్ట లాగించేస్తున్నాడు. ఉండుండి ఆఫీసు టెంటులోనుంచి దశరథరామయ్య గారి దగ్గులు వినిపిస్తున్నాయి.

''ఏం చిన్నయ్యా ! భోజనం అయిపోయిందేవిటి? కేంపు నుండి ఎప్పుడొచ్చావు?'' అని పంతులుగారి భార్య పక్క టెంటు గుమ్మంలో నుండి పలకరించింది.

''దండాలమ్మా. అరగంటయిందండీ, వచ్చి. జీపు షెడ్డులో పెట్టి భోంచేసి ఇప్పుడిప్పుడే చుట్ట కాల్చుకుందామని ఇక్కడికొచ్చాను. పొద్దుట్నుండి తిరిగి తిరిగి నడుం లాగేస్తుంటే, ఈ చెట్టుకి కొంచెం చేరబడ్డాను.''

''ఏం నంజుకున్నావయ్యా? నీ కోసం పెరుగు పచ్చడి దాచాను,'' కసురుకున్నట్టుగా అడిగిం దావిడ.

''ఛఛ ! ఎందుకమ్మా మీకాబాధ? మీ ముసలి కడుపులు గడుపుకోవడమే ఈ రోజుల్లో కనాకష్టంగా వుంటే మళ్ళా దానాలూ..... ధర్మాలూ''

చిన్నయ్య మాటల్ని మధ్యలోనే త్రుంచిందావిడ, ''చాల్లే! దానాలా ! నీ కియ్యడం దానమెందు కయ్యింది? '' అంది అంతకంటే ఎక్కువగా మాటల్లో తన కృతజ్ఞతను చెప్పుకోవడం ఆవిడకి చేతనైంది కాదు గానీ మనసునిండా చిన్నయ్యంటే ఆమెకి గొప్ప గౌరవం, అభిమానం, ఆమెకేకాదు, ఆ కేంపులో అన్ని సంసారాలకూ పెద్ద దిక్కు చిన్నయ్య ! అందరి కుటుంబాలు వారి వారి టెంటుల వరకే పరిమితమైతే ఆ కేంపంతా చిన్నయ్య కుటుంబమే ! అది మిలిట్రీ స్పిరిటంటాడు. కేంపులున్నప్పుడు పొద్దుటనగా బండితీసినవాడు ఏ అపరాత్రికో ఇల్లు చేరుకుంటాడు. ఎటూ

వెళ్ళక్కర్లేకపోయిన రోజుల్లోనైనా ఊరుకోడు. ఆ టెంటులన్నీ తుడి పించడం, మలేరియా మందు జల్లించడం, చిన్న పిల్లల్నందర్నీ చెరువుకి తీసుకెళ్ళి స్విమ్మింగు, డైవింగు చేయించి తీసుకు రావడం, వగైరా పనులన్నీ నెత్తిన వేసుకుంటాడు. పట్నం ప్రయాణం పడినప్పుడు ప్రతి టెంటు దగ్గరికీ పనిగట్టుకు వెళ్ళి ఆ ఇళ్ళల్లో అవసరమైన సామాన్లు కనుక్కుని పెద్దలిస్టు రాసుకుని, పట్నం నుండి పట్టుకొస్తాడు.

అందుకే పిల్లల దగ్గర్నుండి పెద్దవాళ్ళ వరకూ అతనంటే అమితమైన గౌరవం. అందుకే అతను జీపుడ్రైవరు చిన్నయ్య కాడు ! మిలిట్రీ చిన్నయ్య !

''అన్నట్లు చిన్నయ్యో! మీ పంతులు గారు చెబుతూంటారు. మన దొరగారికి నువ్వంటే ఎంతో ఇదట? ..... అసలు నువ్వు లేందే కేంపు కెన్సిలు చేసుకుంటాడు.....''

ఆవిడేదో ఇంకా అడగబోతూంటే మధ్యలోనే చిన్నయ్య అందుకున్నాడు ''ఔనమ్మా! బ్రతికున్న న్నాళ్ళూ మీఅందరిలోనూ మంచిఅనిపించుకుని, చచ్చిన్నాడు గుండుదెబ్బలాగా ఢన్‌మని పోవాలి. మిలిట్రీ చావు చావాలి. సివిలోళ్ళలాగా తీసుకూ, లాగుకూ చావకూడదు. అదమ్మా నా కోరిక''

''ఛ! అవేంమాటలయ్యా ? ..అది సరేగానీ, మీ దొరగారికి ఉత్తుత్తి అభిమానమేనా లేక పోతే, కేంపులో వున్నప్పుడు తిన్నావా, ఉన్నావా అని.....''

''..... హమ్మమ్మ! దొరగారు కుర్రోడైనా గొప్ప మనిషమ్మా. దేవుడిలాంటోడు. ఎప్పుడైనా కస్సు బుస్సు మంటాడు గానీ, మనసు మహా మెత్తనిది. ఉత్తి ఎర్రోడు . సివిలోళ్ళలో అటువంటి ఆఫీసర్ని నేను చూడలేదమ్మా. ఒక్క నాకే కాదు, అతనితో కేంపుకొచ్చిన వాళ్ళందరికీ ముందు పెడితే గానీ, తాను తినడు '' అంటూ పంతులమ్మ పక్కనే ఎవరో కదుల్తున్నట్టు గమనించాడు.

'' ఎవరమ్మా మీ పక్కన, ఎవరీ బుల్లెమ్మ '' అంటూ పంతులమ్మ పక్కన చీకట్లో మసగ్గా కని పిస్తున్న అమ్మాయిని చూశాడు.

''మా అమ్మాయి చిన్నయ్యా ! పొద్దున్నే అల్లుడొచ్చి దిగబెట్టి, సెలవులేక వెంటనే వెళ్ళిపోయాడు. పిల్ల దానికి ఇప్పుడు ఏడో నెల. ఎనిమిదో నెల ప్రవేశంలో మా బావగారి ఇంటికి పురిటికి దిగబెట్టా లనుకుంటున్నాం. ఈ లోపున ఒక నెల్లాళ్ళు మా దగ్గరుంచుకుందామని అల్లుడికి రాస్తే తీసు కొచ్చాడు.''

'' ఐతే అదేటి బుల్లెమ్మా?'' ఖస్సుమన్నాడు డిసిప్లినేరియన్ చిన్నయ్య. '' అర్ధరాత్రి దాకా మేలుకున్నా వేంటి? ఉట్టి మనిషివి కావు! పెందరాళే పడుకోవడం, కావలసినంత రెస్టు తీసుకోవడం అలవాటు చేసుకోవాలమ్మా !'' అని గదమాయించాడు. '' చూడు బుల్లెమ్మా; నీకేదైనా తినా లనుంటే, నేను ఎప్పుడూ పట్నం ఎల్తూనే వుంటాను. నాతో చెప్పు మొహమాటం పడేవు''

ఆఫీసు టెంటులోనుండి దశరథరామయ్య దగ్గుతున్నాడు.

'' అన్నట్లు పంతులమ్మగారూ! అయ్యగారికి కాస్త చెప్పండమ్మా. రాత్రింబగళ్ళు ఒకటేపనా? అసలు ఆ బాబు ఎప్పుడు తింటాడో ఎప్పుడు పడుకుంటాడో? ఎప్పుడూ ఆఫీసు, లెక్కలు, కాయితాలు వయసు మళ్ళినవాళ్ళు అంతగా పనిచెయ్యకూడదమ్మా. పోనీ బలమైనోడా? బక్కచిక్కిన ప్రాణం.......''

‘‘ చెప్పి చెప్పి నోరు పడిపోయిందయ్యా బాబూ ! వింటేనా? ఏదైనా టానిక్కు కొనుక్కుని తాగమన్నా వినరు. ‘‘ రాత్రి ఒంటి గంటా రెండు గంటల వరకూ ఉండకండీ, తొందరగా పడుకోండి, ఆరోగ్యం దెబ్బతింటుంది.’’ అంటే ‘‘ ఆఫీసుపని ఎవరు, నీ బాబు చేస్తాడు?’’ అని ఖస్సున లేస్తారు. పోనీ మాకు మరో ఆస్కారం ఉందా అంటే, ఒక చిల్లి కానీ వచ్చే దారిలేదు. పంతులు గారు ఈ ఉద్యోగం చెయ్యకపోతే, ఆయన, నేను, నా పిల్లడు మలమలమాడి చావాల..... చిన్నయ్యా! అతని కష్టం చూస్తుంటే కళ్ళ వెంట నెత్తురు చుక్కలు కారుతున్నాయి. అతని నెత్తురు పీల్చేస్తున్నాం...’’ అంటూ మరి మాటాడలేక బావురుమంది.

‘‘ఊరుకోమ్మా; ఊరుకోవే, నాన్నగారు వింటారు’’ అని కూతురు సముదాయిస్తోంది.

అర్ధరాత్రి ఆ కీకారణ్యంలో వయసు మళ్ళిన ఒక స్త్రీ తమ బ్రతుకుల్ని తలచుకుని బావురుమంటూంటే – యుద్ధభూమిలో శవాల మీదనుండి ట్రక్కులు నడిపిన మిలిట్రీ చిన్నయ్య బండబారిన గుండె కూడా చివికిపోతోంది.

‘‘ ఊరుకోవమ్మా, పెద్దదానివి ఏడవొచ్చునా? ఒట్టి మనిషికాని చిన్నపిల్ల ముందు మన కష్టాల గూర్చి మాటాడకూడదు.’’ అంటూ చెమ్మగిల్లిన కన్నుల్ని అప్రయత్నంగా తుడుచుకుంటూ, పంతులమ్మవైపు సూటిగా చూడలేక నల్లటి బూట్లలో ప్రతిఫలిస్తున్న మంటల్ని చూస్తూ విషయం మార్చడానికి ఆ అమ్మాయి నుద్దేశిస్తూ ‘‘ మీ ఆయనకి దేంట్లోవని బుల్లెమ్మా? ’’ అని అడిగాడు.

ఇంకా తల్లిని ఓదారుస్తునేవున్న ఆ అమ్మాయికి ఈ మాటలు వినిపించలేదు. ‘‘ఊరుకోమ్మా. అసలే నీ ఒళ్ళు మంచిది కాదు, గుండెల్లో నొప్పొస్తుంది.’’

పంతులమ్మ దుఃఖాన్ని మెల్లమెల్లగా దిగమింగుతోంది. చిన్నయ్యకి ఏం మాట్లాడాలో తోచలేదు. మనసంతా పాడైపోయింది. పడుకుందామని లేవబోయాడు.

‘‘ గాండ్ర్...... గాండ్రు...... గాండ్ర్.......’’

కొండల్లో పెద్దపులి అరుపు ఒక్కమారు వినిపించింది.

అడివంతా ఆ అరుపుతో దద్దరిల్లిపోయింది. అంతవరకూ ‘‘జుంయ్’’ మని రొదచేస్తున్న కీచురాళ్ళు చప్పున ఆగిపోయాయి. అంతటా భరింపరాని నిశ్శబ్దం ఆవరించుకుంది. పంతులు గారి అమ్మాయి గట్టిగా తల్లిని పట్టేసుకుంది.

‘‘ అమ్మో! పెద్దపులి అరుపులా వుంది, ఇటు వస్తుందేమో, పద లోపలికి పోదాం.’’ అంటూ హడావుడిగా లేచింది పంతులమ్మ. బ్రతుకు భయంతో అంతవరకూ కుమిలిపోతున్న ఆవిడకి ప్రాణభయం కూడా పట్టుకుందిప్పుడు.

‘‘ అదేం చేస్తాదమ్మా? ఎక్కడో దూరంలో అరుస్తోంది. పాపం మేతకి బయలుదేరినట్టుంది. దాని తోవన అదిపోద్ది. మనిషి మాంసం తినమరిగిన పులులు తప్పించి, మరేవీ అసలు మనిషి ఛాయలకే రావమ్మా, అలాంటి పులులు ఈ దగ్గర్లో లేనేలేవు. అరే, ఎందుకమ్మా అంత గిజగిజలాడిపోతున్నారు? అసలు ఇయ్యేం పులులని? నేను మిలిట్రీలో ఉన్నప్పుడు బర్మాలో చూశాను. అవీ, పులులంటే ! ఒకసారి, బుల్లెమ్మా; ఇలాగే మాంచి రాత్రి మీద ట్రక్కు తీసుకొస్తున్నాను. ఇంకేముంది, రోడ్డుమీద అడ్డంగా పడుకునుంది, సీదాగా గాడీని దానిమీద కెక్కించేశాను.. దెబ్బకి’’ అని చెప్పబోతూ గతుక్కున ఆగాడు.

''బ్లోవ్..... బ్లోవ్.... బ్లోవ్.....''

ఆకలిగొన్న దెయ్యం అరుస్తున్నట్టు మరో అరుపు. పెద్దపులి అరుపులాగ గంభీరంగా లేదు, వికృతంగా వుంది. అంతవరకూ నిబ్బరంగా కబుర్లు చెప్తున్న చిన్నయ్య కూడా ఈ అరుపు వినగానే గతుక్కుమని లేచి నిలబడ్డాడు.

''ఇదేమిటి చిన్నయ్యా? ఇదేదో కొత్త అరుపులా వుంది; ఎప్పుడూ వినలేదే?'' అంది పంతులమ్మ.

పులి అరుపుతోనే సగం హడలిపోయిన అమ్మాయి ఈ కొత్త అరుపుతో బెంబేలెత్తిపోయి తల్లిని మరింత గట్టిగా పట్టేసుకుంది.

''వఱడు.... దీన్ని వఱడంటారమ్మా!''

''అంటే?''

''బాగా ముదిరిపోయిన ముసిలినక్క, డొక్కులా ఉంటుంది. గొప్ప మాయదారిది. లుచ్చా జంతువమ్మా! చూశారా.... ఆ అరుపు ఎంత భయంకరంగా ఉందో! దీన్ని అడవిలో జంతువులన్నీ దెయ్యాన్ని చూసినట్లు చూస్తాయి. ఇదెప్పుడూ పులివెంట తిరుగుతూంటుంది. బాగాముసలిదై పోవడం వల్ల, దానంతటది వేటాడి తినలేదు. అందుకే పులిని అంటి పెట్టుకుని ఎప్పుడూ తిరుగుతుంటుంది. పులి తిని విడిచిపెట్టేసిన మాంసం, దుమ్ములు తిని బ్రతుకుతుంది. స్వతంత్రంగా బ్రతకలేదు. పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రవగానే పులిని చాటుగా వాటి మీదికి తీసుకెళ్ళి చంపించేస్తుందిట. పులి చంపి తినగా ఒదిలిన మాంసంతో తన ముసలి కడుపు నింపుకోవడానికి! గొప్ప దగుల్బాజీ జంతువు.''

''బ్లోవ్..... బ్లోవ్!'' వఱడు అరుపు దూరమౌతోంది.

''గాండ్ర్..... గాండ్ర్..... గాండ్ర్......'' దాని వెనకాలే పులి అరుపులు.

''ఈ రాత్రి అడవిలో గొప్ప ఘోరం జరిగిపోతాదమ్మా. విన్నారా వాటి అరుపులు. వఱడు దేనిమీదకో పులిని ఉసిగొలిపి తీసుకుపోతోంది. పాపం దేని ఆయుష్షు మూడిందో దాన్ని చంపించేసి, ఎంగిలికూడు ఇది కూడా తిండానికి! పొట్ట కోసం ఎంత నీచం పని?'' చిన్నయ్య మనసు కకావికలైపోయింది. ''ఛ! పడుకునే ముందు, దీని అరుపు విన్నాను శనిలాగ..... మీ రెళ్ళి పడుకోండమ్మా. చాలా రాత్రయిపోయింది.'' అని బయలుదేరాడు తన టెంటువైపు. పంతులమ్మ అమ్మాయిని తీసుకుని లోపలికెళ్ళింది. టెంటు పరదాలు గట్టిగా దగ్గరకి లాగి రాళ్ళు అడ్డం పెట్టింది.

చిన్నయ్య టైము చూసి లైటు ఆర్పేసి మంచం మీద పడుకున్నాడు. మరికొంత సేపటికి ఆఫీసు నుంచి ఇంటికి వెళుతున్న దశరథరామయ్య గారి కిర్రు చెప్పుల చప్పుడు మగత నిద్రలో స్పష్టాస్పష్టంగా వినిపించింది.

తెల్లవారుజాము మూడు గంటలయింది. దట్టంగా పొగ మంచు కమ్ముకుంటోంది కేంపులో మంటలు చల్లబడిపోతున్నాయి. హఠాత్తుగా కలకలం బయల్దేరింది. అటూ ఇటూ గడబిడగా పరుగెత్తుతున్నారు. చుట్టుపక్కల ఆడవాళ్ళు పంతులుగారి టెంటువైపు పరుగెడు తున్నారు. లోపలి నుండి ఉండుండి మూలుగులు వినిపిస్తున్నాయి. ''అయ్యో తల్లీ ఇదేవిటే, అమ్మా? ఇప్పుడే వచ్చాయేఁవిటి ఈ మాయదారినొప్పులు! నేనిప్పుడు ఏంచేసేదమ్మా?'' అని పంతులమ్మ శోకాలు

పెడుతోంది. దశరథరామయ్య ఏమీ తోచక మతిపోయిన వాడిలాగా టెంటు బయట తిరుగుతూ, వచ్చిన వాళ్ళతో ఏదేదో మాటాడుతున్నాడు. మధ్య మధ్య పెళ్ళాన్ని ''నువ్వు కాస్త నోరుమూసుకో! మధ్య నీ ఏడుపు ఎక్కువై పోతోంది.'' అని గదమాయిస్తున్నాడు.

చిన్నయ్య నిద్రలేచి బైటకొచ్చాడు. దశరథరామయ్యతో మాటాడుతూన్న సింగుగారి భార్య చిన్నయ్యని చూడగానే '' ఏయ్ మిలిట్రీ ఆద్మీ! ఇదర్ ఆవొనా! '' అని పిలిచింది. చిన్నయ్య రాగానే అంతా చుట్టుముట్టారు. పంతులుగారి అమ్మాయికి నెలలు నిండకుండానే పురిటి నొప్పులు వచ్చేశాయని, ఏడోనెల కాన్పు; అందులో తొలిచూలు; చాలా కష్టమని, వెంటనే పట్నంలో హాస్పిటల్‌లో చేర్పిస్తేగానీ లాభం లేదనీ అక్కడున్న ఆడవాళ్ళు వాళ్ళ వాళ్ళ భాషల్లో ఏకరువు పెట్టారు. ఈ పాడు అడవిలో ఏ కష్టం వచ్చినా దిక్కు మాలిన చావు తప్ప వేరేగతి లేదనీ, హాస్పిటల్ లేక పోయినా కనీసం మందివ్వడానికి డాక్టరు ముండాకొడుకైనా లేడనీ, రైల్వే కన్‌స్ట్రషన్‌లో పనిచేసే వాళ్ళని పెళ్ళాడిన ఆడవాళ్ళ బతుకులింతేననీ – ఏకంగా రైల్వే అధికారుల్నే అరవ ఏసతో జాడించి పారేస్తోంది స్టోరుకీపరు కళ్యాణ రామన్ గారి ద్వితీయ కళత్రం.

''మీ మొగాళ్ళందరూ అలా మొహాలు చూస్తూ నిలబడ్డమేనా లేక అమ్మాయిని వెంటనే పట్నం తీసుకెళ్ళే ఏర్పాట్లేమైనా ఉందా?'' అంటూ అగ్గి మంటల మీద నీళ్ళు కాగబెడుతున్న సుమతి కుట్టియమ్మ మలయాళంలో ఆ గుంపులోని మొగుడిమీద చండికలా పడిపోయింది.

''గోల చెయ్యకండమ్మా! ఇదుగో పంతులు గారూ, అమ్మ గార్నీ అమ్మాయినీ, పట్నం ప్రయాణానికి సిద్ధం చేయించండి. దొరగార్ని జీపు అడగండి. ఇప్పుడే నేను పట్నం తీసుకెళ్తాను.'' అన్నాడు చిన్నయ్య.

''ఆఁహాఁ! అది గవర్నమెంటు జీపుగదా, దొరగారిని అడిగితే బాగుంటుందా? .... అందులోనూ ఈ రాత్రప్పుడు'' అని దశరథరామయ్య నసిగాడు.

'' మనంకూడా గవర్నమెంటు మనుషులమే బాబూ! మీరు ముందు సిద్ధంకండి.... మీకంత ఇదైతే నేనే వెళ్ళి దొరగార్ని జీపు అడుగుతాను.''

'' బాబ్బాబు, నీకు పుణ్యముంటుంది. నువ్వే అడిగి పుణ్యం కట్టుకుందూ.'' అని దీనంగా చిన్నయ్య చేతులు పట్టుకున్నాడు.

'' చాల్లేండి పంతులుగారూ, భలేవారే!'' అంటూ చేతులు విదిలించుకుని ఇంజనీరుగారి టెంటు వైపుకు నడిచాడు చిన్నయ్య.

ఇంతలో పంతులమ్మ గారి పిలుపువిని లోపలికి వెళ్ళాడు దశరథరామయ్య. ''అయ్యో రామా! జీపుఅడగడానికి మీరు వెళ్ళలేకపోయారా? చిన్నయ్యనే పంపించారూ? మనపనిక్కూడా ఇంకొకళ్ళనే పంపించాలా? మీరే వెళ్ళండి. మళ్ళీ పెద్ద ఎకౌంటెంటు నంటారు. ఆ పాటి జీపు అడిగి తేలేరూ?'' అంటూ సర్రున తాచుపాములాగ లేచింది.

'' నువ్వు కాస్త నోరుమూసుకోవే! ఎందుకలా గొంతు చించుకుంటావు....... తెలియని దానివి తెలియనట్టూరుకోవాలి. ఆడముండలకేం తెలుసు దొర్ల సంగతి? అసలే మా ఇంజనీరు రావణాసురుడిలాంటివాడు. దానికి తోడు పగలంతా కేంపులు తిరిగి తిరిగి, అలసిపోయొచ్చి పడుకునుంటాడు, ఈ రాత్రప్పుడు లేపితే ఇంకేమన్నా ఉందా? పులిలా పడిపోతాడు. అసలే

కోపిష్టోడు. తిక్క రేగిందంటే వెనకా ముందు ఆలోచించకుండా రేపొద్దున రపుక్కున ఉద్యోగం ఊడదీసేస్తాడు. అప్పుడు నువ్వు నేనూ రోడ్ల మీద చిప్ప పట్టుకు తిరగాలి. ఇలాంటి బోడి సలహాలు మాని నోరుమూసుకు కూచో!'' అంటూ గొణుక్కుంటూ బైటకొచ్చి టెంటుముందు చిరాగ్గా పచార్లు మొదలు పెట్టాడు.

కాల్‌బెల్ విని నిద్రలేచి, మత్తుగా ఒళ్ళు విరుచుకుంటూ బైట కొచ్చి; చిన్నయ్యని, దశరథ రామయ్య టెంటుముందు అలికిడినీ చూసి ''ఏమిటి చిన్నయ్యా, ఏం జరిగింది? ఎవరికైనా బాగు లేదా?'' అని ప్రశ్నించాడు, అసిస్టెంటు ఇంజనీరు రామారావు.

''పాపం, పంతులుగారి అమ్మాయికి పురిటి నొప్పులు అకస్మాత్తుగా వచ్చేశాయట సార్. నెల రోజులుండి పోదామని వచ్చిందట, పొద్దున్నే. అనుకోకుండా పాపం ఏడో నెల్లోనే నొప్పులొచ్చే శాయటండీ. పట్నానికి తీసుకు వెళ్తేనే గానీ లాభం లేదంటున్నారు సార్''. అన్నాడు చిన్నయ్య.

''అయ్యో పాపం! ఇప్పుడెలాగా?''

''జీపు కావాలి సార్! పట్నం తీసుకెళ్లి ఆస్పత్రిలో జాయిన్ చేసొస్తాను''.

''జీపా?'' ''అది..... గవర్నమెంటు వెహికలు...... తీసుకెళ్తే.....'' అని ఏదో నానుస్తున్నాడు రామారావు.

''అదేమిటి సార్, అలా అంటారు; ప్రాణంమీది కొస్తేను!...'' ఐనా, గవర్నమెంటు బళ్ళు ఎన్ని సార్లు పిక్నిక్కులకి, పార్టీలకీ, దొరల బుడ్డీలకీ, తిరగడంలేదు?'' అంటూ ఇంకేవో చెప్ప బోతున్నాడు. హీటెక్కిపోతున్న మిలట్రీ చిన్నయ్య.

''ఊఁ ఊఁ!! సర్లే.... టేబులు మీద తాళాలున్నాయి, తీసుకెళ్ళు. పొద్దున్న ఎనిమిదో గంట కంతా ఉండాలిసుమా, కేంపుంది. బ్రిడ్జి ఇన్స్‌పెక్షన్, జాయిన్ చేసిన తరువాత పంతులు గార్ని కూడా నీతోనే తీసుకొచ్చేయ్. బోలెడు పనుంది.'' అంటూ సిగరెట్టు వెలిగించాడు.

''ఏడో గంటకల్లా ఇక్కడుంటాన్ సార్?'' అంటూ టెంటు లోపలికెళ్ళి తాళాలు తీసుకుని బైటకెళ్ళాడు.

''చూడు చిన్నయ్యా, పంతులుకేమైనా డబ్బు అవసరముంటే అడగమను. మొహమాట పడొద్దని చెప్పు''.

''అలాగేసార్!'' అంటూ వెళ్ళి షెడ్లోని జీపుతీసి దశరథరామయ్య టెంటు ముందు ఆపాడు.

''ఊఁ, ఊఁ, రెడీ, రెడీ! ఎక్కండీ!'' అంటూ సామాన్లన్నీ తనే జీపులో పెట్టాడు. అక్కడున్న ఆడవాళ్ళంతా అమ్మాయిని జాగ్రత్తగా వెనక సీట్లో కూచోపెట్టారు. కూతుర్ని పెట్టుకుని పక్కనే కూర్చున్నారు పంతులమ్మగారు. దశరథరామయ్య ముందు సీట్లో చిన్నయ్య పక్కన కూర్చున్నాడు.

ఆడవాళ్ళంతా అమ్మాయికి ఫరవాలేదని ధైర్యం చెప్పారు.

''ఏయ్ మిలట్రీమేన్! దేఖో! ఇదర్ మిలట్రీకా స్పీడ్‌మత్ దిఖావ్! జోర్ సే మత్ జావో! ధీరేసే గాడీలేనా.... అంటూ హెచ్చరించింది సింగుగారి భార్య.

''ఠీక్ హై!'' జీపు జర్రుమని స్టార్ట్ చేశాడు. జీపు లైట్లు చీకట్లని బాణంలా చీల్చుకుంటూ రోడ్డు మీద ముందుగా పరుగెడుతున్నాయి.

ఇంజనీరు రామారావు గారు తనటెంటుముందు సిగరెట్లు కాల్చుకుంటూ చిన్నయ్య సోషల్

వర్కుని లోలోన అభినందించుకుంటున్నాడు. ఎవరికైనా కష్టంవస్తే చూడలేడు చిన్నయ్య, నడుం కట్టుకొని ముందుకొస్తాడు. ఆర్నెల్ల క్రితం కాలనీలో మసూచికం వస్తే అందరి టెంటుల్లోకి వెళ్ళి చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరికీ సేవచేశాడు. రాత్రింబవళ్ళు జాగారం చేశాడు. ఒకసారి అతనికి మలేరియా జ్వరం వచ్చి రెండ్రోజులు ఒంటిమీద తెలివి లేకుండా పడుంటే అన్ని సేవలూ చేశాడు. అందుకే చిన్నయ్య పట్ల రామారావుకి అంత గౌరవం.

''ఎటొచ్చీ తిక్క ముండాకొడుకు . నిజం చెప్పినా కఱ్ఱ విరగ్గొట్టినట్టు చెప్తాడు. సరిగా మాట్లాడ్డం తెలీదు. మిలట్రీ వాడు గదూ.'' అని మనసులో అనుకుంటూ గట్టిగా దమ్ములాగుతూ దూర మౌతున్న జీపుని చూస్తున్నాడు. జీపు డౌనులో దిగిపోయింది. మరి లైట్లు కనిపించడంలేదు. మెల్ల మెల్లగా చలి ఎక్కువౌతోంది. రామారావు టెంటులోకి వెళ్ళిపోయి తెరలు మూసేసాడు.

## 2

కేంప్ సైటుకి మైలు దూరంలో వుంది వర్క్‌స్పాట్.'' కారడవుల్లో కొత్తగా రైల్వేలైను వేస్తున్నారు. వేలాది పనివాళ్ళు శ్రమించి పనిచేస్తున్నారు. సూర్యోదయంనుంచి తిరిగి సూర్యాస్తమయం దాకా బుల్‌డోజర్లు, డంపర్లు క్రేనులు ధడ్ ధడ్ మని శబ్దం చేస్తుంటాయి. అక్కడే ఒక పెద్ద బ్రిడ్జి కూడా కడుతున్నారు. రోజంతా గుభిలు గుభిలుమని కొండరాళ్ళు పేలుతుంటాయి. హిందూస్తానీలు, బ్రిడ్జి పనులు చేసే మలయాళీ మోపలాలు, సర్దార్జీలు, బంగాళీ బాబులు, ఒకరేవిటి, అన్ని రకాల జాతులవాళ్ళనీ అక్కడ చూడొచ్చు. ఉత్తరాది నుండి వచ్చిన కాంట్రాక్టర్లు కేంపుని వర్క్ స్పాటుకి దగ్గర్లోనే వేసుకున్నారు. రైల్వే కేంపు మాత్రం మైలు దూరాన ఉంది. అటు ఇటు, కాంట్రాక్టర్ల జీపులు, రైల్వే జీపులు చాకుల్లా తిరుగుతుంటాయి.

అసిస్టెంట్ ఇంజనీరు గారి జీపు ఆగగానే కంట్రాక్టర్లు సవినయంగా నమస్కారం చేస్తూ ''ఆయియే సాబ్!'' అంటూ ఎదురుగా వెళ్ళారు . ముందుసీట్లో నుంచి అసిస్టెంట్ ఇంజనీరు రామా రావు గారు, వెనక సీటునుంచి అకౌంటెంటు దశరథరామయ్య గారు దిగారు. దశరథ రామయ్య చేతిలో రెండు లావుపాటి ఫైల్సున్నాయి.

చిన్నయ్యా, దశరథరామయ్యలు కూడా వాళ్ళిచ్చిన కాఫీలు తాగేశారు. దశరథరామయ్య మాత్రం ఎందుకో బితుకు బితుగ్గా కనపడుతున్నాడు. ఇంజనీరుగారు వెళ్ళిపోగానే పక్కనే వున్న కంట్రాక్టరు ఆఫీసు టెంటులోనికి వెళ్ళి ఫైళ్ళు విప్పి లెక్కలు మొదలు పెట్టాడు.

''పంతులు గారూ ! నిద్ర ఊపేస్తోంది నేను జీపులో పోయి పడుకుంటాను.'' అంటూ జీపుని ఎదురుగా ఉన్న మర్రిచెట్టు కిందకి లాగించేసి, వెనక సీట్లో ముడుచుకు పడుకున్నాడు చిన్నయ్య.

రాత్రంతా నిద్రలేదేమో దశరథరామయ్యకి కూడా కునుకు ముంచుకొచ్చేస్తోంది. తమాయించు కుంటూ కాగితాలమీద లెక్కలు కడుతున్నాడు. దగ్గర్లోనే పనిచేస్తున్న బుల్‌డోజరు శబ్దం బుఱ్ఱని దొలిచేస్తోంది.

ఇంజనీరు గారు ఇన్‌స్పెక్షన్ నుంచి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటల యింది. ఎండ మండి పోతోంది. ఎప్పుడు పట్టేసిందో నిద్ర, పాపం దశరథరామయ్య టేబుల్ మీద వాలిపోయి అలానే నిద్రపోతున్నాడు.

''దశరథరామయ్య గారూ! ఆ కాగితాలవీ తియ్యండి, సంతకాలు పెట్టేస్తాను. మళ్ళా భోజనానికి టైమైపోతుంది. త్వరగా పోవాలి''. అంటూ నిద్రపోతున్న దశరథరామయ్య ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని; మొగంమీద, మోచేతుల మీదా కారుతున్న చెమటని ''ఉస్సు'' రంటూ తుడుచుకున్నాడు. దశరథరామయ్య నిద్రలోంచి ఉలికిపడి లేచి కళ్ళు నులుముకుంటూ కాగితాలు ఫైలు ముందు పెట్టాడు.

ఫైల్లో కొన్ని కాగితాలు తిరగేసి ఆశ్చర్యంగా దశరథ రామయ్య నిద్రమొహంలోకి చూస్తూ ''పెద్ద బిల్లేదయ్యా?........ అదే బ్రిడ్జి వర్కుది!''

'' చెయ్యలేదు సార్'' – మనిషి గొంతుకలో తడారిపోతూ దీనంగా చెప్పాడు.

''వాట్? చెయ్యలేదా? ఓ! మైగాడ్''... రామారావు కోపంతో ఊగిపోతూ క్షణంసేపు మాట్లాడ లేకపోయాడు. ఎర్రధూళి చెమట పట్టిన రామారావు మొహం కోపంతో మరింత ఎర్రబారింది. కళ్ళు చింత నిప్పుల్లాగ కణ కణ లాడుతున్నాయి. '' నిన్ననగా చెప్పానే ఎవడి చంక నాకుతున్నావ్?'' అరిచాడు.

'' ఎక్స్‌క్యూజ్ మీ సార్! నిన్న రాత్రంతా అమ్మాయికి గడబిడ చేసింది కదసార్?.... రాత్రే బిల్లు చేసేదా మనుకుంటే.....''

'' షటప్! నీ ఇంట్లో గొడవ ఎవడిక్కావాలయ్యా? నీకు డబ్బిస్తున్నది ఆఫీసుపని చెయ్యడానికి గాని, నీ కూతురుకి పురుడొచ్చింది. అదయింది, ఇదయిందని పని ఎగగొట్టడానికి కాదు, వర్త్‌లెస్ ఫెలోస్! '' అని పిడుగు పడినట్టు గర్జించాడు.

ఇంతలో తిరుగు ప్రయాణానికి చిన్నయ్య జీపు తెచ్చి టెంటుముందు ఆపి లోపలికొచ్చాడు. ఎదురుగా దశరథరామయ్య వెలవెల బోతూ గజగజ లాడిపోతున్నాడు.

'' రేపట్నుంచే నిన్ను పనిలోనుండి డిశ్చార్జి చేసేస్తున్నాను. గెటౌట్!.... డోన్ట్ షో యువర్ ఫేస్; పెద్ద దొరగారు ఆ బిల్లు సంతకం చేసి అర్జంటుగా పంపమన్నారని మరీ మరీ చెప్పానే? ఇప్పుడతను నా మీద దెయ్యంలాగ పడిపోతాడు. మీరంతా ఎందుకయ్యా ఉండి. నో! ముసలాడి వని కనికరించి అపాయింట్ మెంటు ఇప్పిస్తే పని ఎగ్గొడతావ్! కీప్ ఆఫ్ ఫ్రమ్ మీ డర్టీ ఫెలో! '' అంటూ ఇంకా కోపం పట్టలేక టేబుల్ మీదనున్న ఫైలు తీసి దశరథరామయ్య మొహం కేసి కొట్టాడు..

అసలే భయంతో సగం చచ్చిపోయిన దశరథరామయ్యకి ఉద్యోగం పోతుందనే సరికి పై ప్రాణాలు పైనే పోయాయి. దాంతో ఫైలు మొహానికి తగలగానే కళ్ళు తిరిగిపోయి పడిపోబోయాడు. పక్కనున్న కంట్రాక్టరు మనిషెవడో పట్టుకుని కింద పడుకోబెట్టి మొహం మీద నీళ్ళు చల్లాడు.

ఇది చూస్తున్న మిలిట్రీ చిన్నయ్య నెత్తురు మరిగిపోయింది.

''నువ్వు మనిషివా, రాక్షసుడివా? '' అని పిడికిలి బిగబట్టి గట్టిగా అరుస్తూ ఇంజనీరు మీదికి పళ్ళు కొరికి వెళ్ళబోతూ, తమాయించుకుని ఆగిపోయాడు.

రామారావు అమాంతంగా నిర్ఘాంతబోయాడు. '' ఏంవిటి, డ్రైవర్ చిన్నయ్యేనా, ఇలా అంటున్నాడు?'' అని తన కళ్ళని తనే నమ్మలేక, కోపంతో వణికిపోతున్న చిన్నయ్యని చూస్తూ క్షణం పాటు అలా వుండిపోయాడు.

'' ముసిలోడ్ని కొడతావా? నువ్వు మనిషివేనా?'' అని మరోసారి గర్జించాడు.

కేకలు విని అంతా చుట్టూ చేరారు. ఇది చూసిన రామారావు అహం దెబ్బతింది. తన దగ్గర పనిచేసే ఒక జీపు డ్రయివరు అంత మంది ఎదుట, అలా తనపై కేకలేస్తూంటే సహించలేక పోయాడు.

'' ఏవిటి చిన్నయ్యా, నువ్వేమన్నా తాగావా? నువ్వెవరివని ఇందులో జోక్యం చేసుకోవడానికి!''

'' నే నెవడినా! నీ లాంటి జంతువును కాను, మనిషిని. ముసలోడు రాత్రంతా పని చేస్తాడు. నిన్న రాత్రయితే అసలు కంటికి కునుకే లేదు. ఏదో పని మిగిలిపోయిందని కొడతావా? ముసిలోడు సొమ్మసిల్లి పోయాడు. చచ్చిపోతేనో? .... మీ కిష్టం లేకపోతే ఉద్యోగంలోంచి తీసేయండి. కొట్టడానికి మీకేం పవర్సున్నాయి?'' అని మిలిట్రీ ఊపుతో విరుచుకు పడిపోతూంటే అందరూ నివ్వెర పోయి చూస్తున్నారు.

''నాకేం పవర్సున్నాయా? అమ్మ రాస్కెల్! ఇంత పొగరు పట్టిందిరా నీకు?'' అంటూ విసురుగా మీదికి వెళ్ళాడు.

చిన్నయ్య తర్జని చూపించాడు. '' మంచిదికాదు సార్, తొందరపడకండి! చెప్తున్నాను; నేను పంతుల్ని కాదు, ఊరుకోవడానికి. ఒంటి మీద చెయ్యి పడిందో ఖైమా చేసేస్తాను.... నేను మిలట్రీ వోడ్ని!''

అప్పుడప్పుడే తెలివిలో కొస్తున్న దశరథరామయ్య అమాంతంగా లేని శక్తిని తెచ్చుకుని లేచి ఆఫీసరుకీ చిన్నయ్యకి మధ్యలోకెళ్ళి '' ఊరుకో చిన్నయ్యా, నీకెందుకు? దొరగారూ మీ రూరుకోండి! దండం పెడతాను '' అంటూ రామారావు చేతులు రెండు పట్టుకుని ఆపుచేశాడు.

''వాట్! నన్ను ఖైమా చేస్తావా?.. నిన్ను.. నిన్ను.. ఏం చేస్తానో చూడు, స్కౌండ్రల్!'' అంటూ ఉగ్ర నరసింహుడిలా శివాలెత్తిపోతూ నేలని కసిదీరా ఒక తన్ను తన్ని టెంటు తెర తోసుకుంటూ వెళ్ళి జీపులో కూర్చుని స్టార్టు చేశాడు. వెనకాలే దశరథరామయ్య నెమ్మదిగా సర్దేసుకున్నాడు. ''తక్కువ వెధవలకి అలుసిస్తే నెత్తి కెక్కరూ? -- మధ్య వీడెవడు బోడిగాడు?.... ఆల్‌రైట్! డిస్మిస్ చేయించేస్తాను వెధవని'' అనుకుంటూ ఏక్సిలేటరు దమాయించాడు రామారావు. ఎర్ర దుమ్ము లేపుకుంటూ కేంపు వైపు పరుగెత్తింది జీపు.

కేంపు చేరుతూనే రామారావు స్టెనో టైపిస్టుని దశరథరామయ్య చేత కబురు పెట్టించి డిక్టేషనిచ్చాడు. ఈ సాయంకాలానికల్లా డిస్ట్రిక్ట్ ఇంజనీరు గారికి చేరేటట్టు స్పెషల్ మెసెంజరు చేత ఉత్తరాన్ని పంపమన్నాడు.

''సాక్డ్ ఆఫ్!....వెధవ, తిరగ బడతాడూ?'' అంటూ ఇంకా ఉప్పెనలా విజృంభిస్తోన్న కోపాన్ని తమాయించుకుని భోజనం చెయ్యకుండా పడుకున్నాడు.

మెలకువ వచ్చేసరికి బాగా రాత్రి దాటిపోయింది. వంట మనిషి టేబుల్‌మీద పెట్టిన చల్లారిపోయిన భోజనాన్ని కాస్త ఎంగిలిపడి సిగరెట్టు వెలిగించి ఆలోచనలో పడ్డాడు. నిద్రలో చాలావరకు కోపం చల్లారిపోయింది. మధ్యాహ్నం జరిగిన సంఘటనల్ని తలచుకుంటూ దమ్ము మీద దమ్ము లాగుతూ పచార్లు చెయ్యడం ప్రారంభించాడు. చిన్నయ్య అలా తిరగబడడం తప్పయినా, దూరంగా ఆలోచిస్తే కాస్త న్యాయ సమ్మతమేమో ననిపించింది..... ఔను. తను అలా దశరథరామయ్య మీదకి ఫైలెందుకు విసరాలి? కోపం పట్టలేక ఆ పని చేశాడు. అది తప్పు కాదా? తప్పే! ఇంతకీ

చిన్నయ్యెవ్వడు? ఎందుకు జోక్యం చేసుకోవాలి? పాపం ముసలివాడు సొమ్మసిల్లి పోగానే చిన్నయ్య చూళ్ళేక పోయాడు. రక్తం మరిగిపోయింది. సకాలంలో బిల్లు చెయ్యకపోతేనే తనకి అంత కోపం వచ్చింది కదా, సాటి మనిషి మొహం తిరిగి పడిపోతుంటే, అందుకు బాధ్యులైన వాళ్ళ మీద చిన్నయ్యకి ఎంత కోపమైనా రావచ్చును. తిరగబడ్డాడు. తనూ రెచ్చిపోయాడు. నో.....! చిన్నయ్య చేసినపని చట్టరీత్యా తప్పయినా న్యాయ దృష్టితో చూస్తే ఆ పరిస్థితుల్లో మానవత్వం గల ఏ మనిషైనా అలాగే ప్రవర్తించాలని నిర్ధారించుకున్నాడు.

ఆ రాత్రి చిన్నయ్య ని కబురు పెట్టి పిలిపించాడు. చిన్నయ్య మామూలుగానే నిబ్బరంగా వున్నాడు. అక్కడ రామారావు చిన్నయ్యా తప్ప మరెవరూ లేరు.

'' కూర్చో ! ఫరవాలేదు. కుర్చీలో కూర్చో. స్పాట్ నుండి నడుచుకొచ్చావా పాపం?''

'' ఫరవాలేదు సార్, నాకు నడక అలవాటే, మిలట్రీ వాడిని, అయినా ఎంత ,మైలే గదా?''

'' ఔను మిలట్రీ వాడివి, అందుకే నన్ను ఖైమా చేస్తానన్నావు?''

''...........''

'' నిన్ను ఎంతో గౌరవంగా చూసుకుంటానే, ఎందుకలా గన్నావు''

'' సార్ ! నన్ను దెప్పిపొడవడానికి పిలిపించారా ! మీరే మరొక్కసారి ఆలోచించుకోండి సార్, అప్పుడు మీకే తెలుస్తుంది. మీరు చేసిన పని తప్పో, కాదో. పంతుల్ని అలా ఫైలుతో కొట్టడం న్యాయ మేనా? బక్క ప్రాణం, సొమ్మసిల్లి పోయాడు గదా ! మీ తండ్రిగారే ఆ పరిస్థితిలో ఉంటేనో....?''

''చిన్నయ్యా , నీకు తెలుసుగదా, నేను కోపిష్టివాడ్నని. అరుస్తాను, గాని కరవను. అరిచే కుక్కని మాత్రమే ! నేను చేసిన పని తప్పే ఐనా నా కోపం తగ్గిం తరువాత చెప్తే నే నొప్పుకోనా? నేను మనిషినికానా? .... సరే, అయిందేదో అయిపోయింది. నువ్వు కోపంలో ఏదో అన్నావు. నేనూ ఏదో అన్నాను....... సరే, అన్నీ మరిచిపో. మనసులో పెట్టుకోక, ఈ మాట చెబుదామనే పిలిపించాను. పోయి పడుకో, చాలా రాత్రయింది''.

''గుడ్‌నైట్ సార్!'' అని సెల్యూట్ చేసి బైటికొచ్చాడు. ''భేష్! ఏం మనిషి? తనది తప్పని తెలుసు కున్న తరువాత తర తమ భేదం చూడకుండా జీపు డ్రయివరునైన నన్ను పిలిపించి తప్పొప్పు కున్నాడు. కుర్రోడైనా దేవుడు. సివిలోళ్ళలో తప్ప పుట్టాడు. అని లోలోన అభినందించుకుంటూ తన టెంటువైపు నడిచాడు మిలట్రీ మాన్ చిన్నయ్య.

## 3

ఆ రోజు ఉదయం అనుకోకుండా డిస్ట్రిక్ట్ ఇంజనీరుగారు కేంపుకొచ్చారు. అంతా ఎదురు వెళ్ళి వాళ్ళని తీసుకొచ్చారు. పెద్ద ఇంజనీరుగారికి అతని సిబ్బందికి - ప్రత్యేకమైన వసతి, భోజనం ఏర్పాట్లు వెంట వెంటనే చేయించారు.

భోజనాలైన తరువాత పదకొండు గంటల వేళ ఇంజనీర్లిద్దరూ మ్యాపులు ముందు పడేసుకుని ఏవేవో చర్చలు జరిపారు. అన్ని కేంపులలో కంటే ఈ కేంపులో పని చురుగ్గా పకడ్బందీగా సాగుతోం దని మెచ్చుకున్నారు పెద్ద ఇంజనీరుగారు.

'' రామారావుగారూ ! మీ అకౌంటెంటు దశరథరామయ్యనీ, అదెవరు చెప్మా - ఆ జీపు

డ్రయివరు – అదే చిన్నయ్యగదూ, అతన్ని కబురు పెట్టండి.''

దశరథరామయ్య ఎప్పుడూ లేంది, గెడ్డం శుభ్రంగా గీసుకొని పంచలో చొక్కా టక్ చేసి, ఎప్పటిదో పాత కోటు వేసుకొని, అతి వినయంగా చేతులు కట్టుకొని దొరగార్లముందు నిలబడ్డాడు. చిన్నయ్య మిలట్రీ ఎటెన్షన్ పోజులో సెల్యూట్ చేసి నిలుచున్నాడు. అతని వైపు రెండు మూడుసార్లు ఎగాదిగా చూసారు పెద్ద దొరగారు.

'' ఇతను మిలట్రీ ............'' అని అడగబోతుండగా,

'' అవునుసార్, ఇతను ఎక్స్ మిలటరీమాన్ !'' అని రామారావు చెప్పాడు.

ఆ మాట వినీ విననట్టుగా ఎదురుగావున్న దశరథరామయ్యనుద్దేశించి '' చూడండి ఎకౌంటెంటు గారు; మీ పనిని మెచ్చుకుని మీ కేసు అసిస్టెంటు ఇంజనీరు రికమెండ్ చేసారు, మీకు మరో సంవత్సరం ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నాను. ప్రూవ్ యువర్‌సెల్ఫ్ టు బి ఎ వర్దీ సన్ టు ది కంట్రీ!'' అంటూ లేచి దశరథరామయ్యకి షేక్‌హేండ్ చేసారు. '' అంతా తమ దయసార్, చిన్న దొరగారు నా పరిస్థితిని చూసి రికమెండు చేసుంటారు!'' అని ఉక్కిరి బిక్కిరైపోతూ ఆనందంతో మరి మాట్లాడలేక కళ్ళంబట జలజల నీళ్ళు కార్చాడు.

''నో, నో. యు డిజర్వ్ ఇట్, ఐసే!'' అని అన్నారు . రామారావు టేబులు మీద పేపరు వెయిటు తిప్పుతూ

'' మీరు చాలా మంచివారు సార్, పాపం ముసలాయనకి ఇంత తిండి పెట్టారు, ఆయన రాత్రిం బగళ్ళు పని చేస్తారు సార్!'' అని మధ్యలో చిన్నయ్య చెబుతూంటే డిస్ట్రిక్ట్ ఇంజనీరు గారికి మంటెక్కింది.

'' చూడూ, ఒకరితో మాట్లాడుతూన్నపుడు మధ్యకి రాకూడదు. అది డీసెన్సీకి వ్యతిరేకం. మళ్ళీ మిలిట్రీ వాడ్నంటావు? ఊ.....?'' అంటూ చిరాగ్గా చిన్నయ్య వైపు కస్సుమనిలేచాడు. వెంటనే మళ్ళా మాట మార్చేసి దశరథరామయ్యనుద్దేశించి --

'' ఇంకా నాలుగయిదు కంట్రాక్టర్ల బిల్లులుండిపోయాయి. ఈ నెలాఖరులోగా కంప్లీట్ చేసేయండి. చాలా డిలే అయిపోయాయి. అన్నట్టు చెప్పడం మరచిపోయాను. రామారావు గారూ మీకేంపుకు జనరేటరు కోసం మాట్లాడాను. చీఫ్ ఇంజనీర్ గారు ఒప్పుకున్నారు . మరో నెల రోజులలో మీ కేంపుకి కరెంటు వస్తుంది.''

'' థ్యాంక్యూ సార్!'' అన్నారు రామారావు

'' ఇదిగో, నీ పేరేంటన్నావు? ...... అదే; చిన్నయ్య! ఇప్పుడు నువ్వు మాట్లాడుదువు గాని.... అసలు ముఖ్యంగా నీ పనికోసమే నేనొచ్చాను. ఇంతకుముందే రావలసింది. కలకత్తా వెళ్ళడం వల్ల రాలేకపోయాను..... ఊఁ; నువ్వేం పని చేస్తుంటావు !''

'' జీపుడ్రయివర్ని సార్ !''

'' వారం రోజుల క్రితం చిన్న దొరగారు బ్రిడ్జి ఇన్‌స్పెక్షనుకి వెళ్ళినపుడు అతన్ని ఖైమా చేస్తానని అన్నావట కదూ ?''

'' యస్సార్,''

ప్రక్కనున్న రామారావు ఛటుక్కున నాలిక్కరుచుకుని కంగారు పడిపోతూ ' నో, సార్! అది

నేను..........''

'' వెయిట్ ప్లీజ్..... అతన్ని మాట్లాడనివ్వండి. నువ్వు కైమా చేస్తావని అనడాన్ని ఒప్పుకుంటున్నావు కదూ?''

'' యస్సార్ !''

'' అది తప్పేనా?''

''ముమ్మాటికీ కాదు. చిన్న దొరగారు దశరథరామయ్య గారిని ఫైలుతో మొగం మీద కొట్టారు. అతను సొమ్మసిల్లి పడిపోయాడు... అలా చేయడం తప్పుకాదా?..... తప్పోకాదో చిన్న దొరగార్నే అడగండి, నేను మధ్యలో కలగ జేస్కున్నానని నా మీదికి పిడికిలి బిగిస్తూ ఒచ్చారు. నా ఒంటిమీద చెయ్యి బడితే కైమా చేసేస్తా నన్నాను. నేనే కాదు ; నా పరిస్థితిలో నున్న ఏ మగాడైనా అంటాడు.''

'' అంటే దొరలు గాజులు తొడిగించుకున్నారనే గా నీ వుద్దేశం? అకౌంటెంటు గారికీ చిన్న దొరగారికీ మధ్య ఘర్షణ నీకే విధంగాను సంబంధించింది కాదు గదా? అనవసర విషయాల్లో జోక్యం కలుగజేసుకోవడమే కాక, నీ పై అధికారిని ఖైమా చేస్తానని బెదిరించడం మోస్ట్ ఇన్ సబార్డినేషన్...... తప్పు ...... నువ్వు కాదంటావా?''

'' రూలు ప్రకారం తప్పే కావచ్చు గానీ మనిషిగా ఆలోచిస్తే అది తప్పు కాదు సార్; సాటి మనిషికి సంబంధించిన విషయం.''

'' మీరు దగ్గిరే ఉన్నారు కదూ? మీరేమంటారు దశరథరామయ్య గారు ! మీరు తప్పుకాదంటారా !'' అని దశరథరామయ్యని ప్రశ్నించారు.

నిల్చున్నవాడల్లా రెండడుగులు ముందుకువేసి, పెద్ద అపచారాన్ని వివరించి చెప్తున్నట్టు కళ్ళు పెద్దవిచేసి, '' తప్పా, తప్పున్నరా సార్ ! అది నాకూ చిన్న దొరగారికీ సంబంధించిన విషయం. నేను తప్పు చేస్తే, కోపం పట్టలేక దొరగారు ఏదో ఫైల్తో కొట్టారే అనుకోండి. అది తప్పా , నా మొహం! ఐనా మధ్య ఈ ఆసామి కెందుకు ! పిల్లలు తప్పుచేస్తే తండ్రులు మందలించరా, సార్? అది తప్పా? ఆఫీసు పనుల్లో గుమస్తాలకీ ఆఫీసరుగార్లకీ మధ్య ఇటువంటి చిన్న చిన్న తగాదాలు జరగటం పరిపాటే. ఐనా, చిన్న బాబుగారు నా మీద ఫైలు విసిరారంటే, అతనికి నా మీద వ్యక్తిగత ద్వేషమా? కందకు లేని దురద బచ్చలికన్నట్టు. ఇతగానికి ఎక్కడ్లేని రోషం వచ్చి కారు కూతలు కూస్తూ దొరగారి మీదికి వెళ్ళబోతాడా? నేను మధ్యలో దూరి ఆపాను బాబు. మిలట్రీ బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు. ఎంత ఇన్సబార్డినేషను! చిన్న దొరగారు ధర్మరాజులై పోయారు కాబట్టి సరి పోయింది. అదే మా కాలంలో లాంటి ఇంగ్లీషు దొరలయుంటేనా అక్కడే గుండేసి కొట్టి స్తారు..!'' అంటూ ఏకబిగిని చెప్పాడు.

ఇది వింటున్న మిలట్రీ చిన్నయ్య నీరు కారిపోయాడు. తన కాళ్ళ క్రింద నేల కూలి పోతున్నట్టు అనిపించింది. అతను చెప్తున్నదంతా మతిపోయిన వాడిలా వింటూ నిల్చున్నాడు. '' ఐతే నేను చేసింది తప్పా. పంతులు బాబూ !'' అనగలిగాడు.

'' తప్పా.... తప్పున్నరా, ఇంకా మెల్లిగా అంటావ్!'' అన్నాడు అప్రయత్నంగా ముఖం పక్కకి తిప్పుకుంటూ.

ఇంతసేపూ ఇదంతా వింటున్న రామారావుగారు రెస్ట్లెస్గా మధ్యలో అందుకొని.

''ఎక్స్‌క్యూజ్మి, సర్! హి ఈజ్ నైస్‌మాన్ దూరంగా ఆలోచిస్తే నాదే తప్పుండి. తరువాత గొడవలన్నీ సర్దుకున్నాయి. రిపోర్టు విషయమే నేను మర్చిపోయాను. ఐ వాంట్ టు విత్‌డ్రా ది రిపోర్ట్...''

''నో, యు కెనాట్. ఐ వ్యూ దిస్ మోస్ట్ సీరియస్‌లీ, చిన్నయ్యా! ఈవేళ సాయంకాలం నుంచీ నీ ఉద్యోగం మాకు అవసరం లేదు. ఈ క్షణమే నీ సెటల్‌మెంట్ పైకం తీసుకోవచ్చును. యు కెన్ గో నౌ దశరథరామయ్య గారూ మీరు కూడ వెళ్ళవచ్చును'' పెద్ద దొరగారు త్వరత్వరగా తేల్చేశారు.

'' యస్, సార్! '' అని బూట్లు టకాయించి సెల్యూటు చేసి బైటకు వెళ్ళిపోయాడు చిన్నయ్య.

రామారావు పెద్ద దొరగారిని చాలా బ్రతిమాలాడు. తన సర్వీసులో ఎప్పుడు ఎవర్నీ బ్రతిమాలనంతగా చిన్నయ్యకోసం బ్రతిమాలాడు; కానీ, ''దొరగారు'' వినలేదు. ''ఇన్ సబార్డినేషన్ ఇవేళ మీకు, రేపు నాకు అవుతుంది; మిస్టర్ రావ్! నువ్వింకా కుర్రాడివి! ఇలాంటి ఆర్గ్యుమెంట టివ్ స్టాఫ్‌ని ఎక్కడికక్కడ నొక్కెయ్యకపోతే నెగ్గలేం...... టేకిటీజీ... అంటూ అప్పటికే స్టెనో సిద్ధం చేసిన చిన్నయ్య డిస్మిసల్ ఆర్డర్స్ మీద ఫరఫర సంతకాలు పెట్టేసి జీపెక్కి వెళ్ళిపోయాడు.

సూర్యుడు పడమట కొండల్లోకి దిగిపోయాడు. చిన్నయ్య డబ్బాడవాలా అన్నీ కిట్‌బేగ్‌లో వేసికట్టేసి వీపుకి తగిలించుకున్నాడు. హరికేన్ లాంతర్ని, వాటర్ బాటిల్‌న్నీ కూడ వీపుని వేలాడేసుకున్నాడు. చూడ్డానికి ఉద్యోగం పోయినవాడిలా లేడు. యుద్ధంలో కేంపు మారుతున్న మిలట్రీ సోల్జర్ లాగున్నాడు. విచారంగాని దిగులుగాని మచ్చుకైనా ముఖంలో కనిపించటం లేదు. జీపు తాళాలు ఇచ్చేస్తూ ఇంజనీరు గారికి ఆఖరి సారిగా సెల్యూట్ చేశాడు. రామారావు చిన్నయ్య ముఖంలోకి చూడలేక తలదించుకున్నాడు.

''ఎందుకు బాబు, బాధపడతావు? .... నువ్వు కుర్రోడివిగానీ, దేవుడివి బాబు! ఒకసారన్నావు గ్నాపకముందా, అరిచే కుక్కనని! చస్, నువ్వెందుకు కుక్కవయ్యావు బాబు? పులిలాంటోడివి. రాజా జాతి. నీ గుండె మైదానం లాంటిది. నిన్ను అంటిపెట్టి బ్రతుకుతున్న మేము కుక్కలమే. నక్కలమే; నువ్వు సివిలోళ్ళలో తప్ప పుట్టావు. నేనొస్తాను, బాబు.'' అంటూ అక్కడినుండి వచ్చేశాడు.

చిన్నయ్య వెళ్ళిపోతున్నాడని తెలిసి ఆ కేంపులో జనమంతా గుమిగూడి పోయారు. అందరితోనూ నవ్వుతూ షేక్‌హేండ్ ఇస్తున్నాడు. కొందరు కంటతడిపెడుతూండటం గమనించి ''ఏమి సివిలోళ్ళయ్యా. నేను చచ్చిపోతున్నానా? ఎందుకలాగైపోతారు?.... వారెవ్వా... అంటూ వీపులు చరుస్తున్నాడు.

'' మంచోడిని ఉద్యోగం నుంచి తీసేశారు. ఈ ఆఫీసర్లకి పెద్దరోగం రాదా?'' అని ఆఫీసర్లని, రామారావుకి రాని అరవం భాషలో తిడుతూ చిన్నయ్యకి గ్లాసుడు మజ్జిగ అందించింది కళ్యాణ రామన్ గారి ద్వితీయ కళత్రం.

ఇంతలో కారం అటుకులు పొట్లం కట్టి పట్టుకొచ్చిన సింగు గారి భార్య ఆ పొట్లం అతని సంచిలో పెడుతూ'' హే! మిలట్రీ మాన్, హమ్ సబ్ లోగ్‌కో ఛోడ్‌కర్ కహాఁ జాతేహో!'' అని చిన్న పిల్లలా బావురుమంది.

ఇంతలో ఎదురుగా గుమ్మం దగ్గిర పంతులమ్మ, అమ్మాయి నిల్చున్నారు. ''చిన్నయ్యా?

చీకటి పడిపోయింది. ఇప్పుడెక్కడికెళతావు. ఈ రాత్రికి మా ఇంట్లోనే భోంచేసి పడుకో; రేప్పొద్దునే వెళ్ళొచ్చును.'' అంది పంతులమ్మ చిన్నయ్యకి ఎదురుగా వెళ్ళి .

'' ఒద్దమ్మా! మరిక్కడ ఎందుకు? పోతాను'' ...... అని లోపలికి మంచంమీద పడుకునున్న పసిగుడ్డువైపు తొంగిచూసి '' ఒరేయ్ బుల్లోడా ! పెద్దోడవైతే ఈ సివిలోళ్ళలో చేరిపోకురోయ్ నాలాగా మిలట్రీ వోడివికా! బుల్లెమ్మా ఈడ్ని మిలట్రీలో చేర్పించు'' అంటూ చిన్న విజిలేశాడు.

'' నిన్ను ఉద్యోగంలోంచి తీయించేసిన వాళ్ళకి తప్పక నీఉసురు తగుల్తుంది'' అంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటోంది, పంతులమ్మగారు. చిన్నయ్యని చూడలేక, మంచంమీద నిద్రపోతున్న బిడ్డని చూస్తూ జలజల కన్నీరు కారుస్తోంది పంతులు గారమ్మాయి.

దశరథరామయ్య జాడ ఎక్కడా లేదు, ఎక్కడో నక్కలా జారుకున్నాడు.

చిన్నయ్య కేంపు విడిచి రోడ్డెక్కిపోయాడు. వెనక్కి తిరిగి చూడకుండా నడుస్తున్నాడు.

వీపు మీద హరికెన్ లాంతరూ, వాటరు బాటిలూ ఒక దాన్నొకటి కొట్టుకుంటూ టకటక లాడటం కర్ణాకర్ణిగా వినిపిస్తోంది. వెన్నెల పాడిచి పిండారబోసినట్టుంది.

టెంటు ముందు నిల్చున్న అసిస్టెంట్ ఇంజనీరు రామారావు గారికి రోడ్డు మీద నడు స్తున్న చిన్నయ్య వెన్నెట్లో స్పష్టంగా కనిపించాడు.

ఇంతలో హఠాత్తుగా '' గాంఢ్ గాంఢ్'' మని పులి గర్జించింది. . అమ్మో...... పులి..... చిన్నయ్య... అంటూ టెంటులోంచి పంతులమ్మ పరిగెత్తుకొచ్చి చూసింది.

నిమ్మళంగా అసలు పులి అరుపు వినపడనట్టే చిన్నయ్య నడుచుకుపోతున్నాడు.

అతనిధైర్యానికి నిర్ఘాంతపోయి చూస్తూండగా ఇంతలో మరో వికృతమైన అరుపు వినిపించింది.

'' బ్లోవ్......బ్లోవ్.....బ్లో.....బ్లో...'' వఱడు అరుస్తోంది.

నడుస్తున్న చిన్నయ్య అమాంతంగా ఉలిక్కిపడి ఆగిపోయాడు. అలా ఒక క్షణంసేపు నిలబడి పోయి, తిరిగి గబగబా నడక సాగించాడు.

పంతులమ్మగారు చిన్నయ్యనే చూస్తూండిపోయారు. పులికి జడవని చిన్నయ్య వఱడుకి జడిసిపోయాడు. డౌను దిగిపోయిన తరువాత మరి చిన్నయ్య కనిపించలేదు.

పడుకున్నాడేగాని రామారావుకి నిద్రపట్టలేదు.

అర్ధరాత్రి గడిచాక దశరథరామయ్య యిల్లు చేరుకున్నాడు.

ఆ రాత్రి తెల్లవార్లూ '' బ్లోవ్! బ్లోవ్! బ్లోవ్! '' మని వఱడు అడవిలో అరుస్తూనే ఉంది.

★

( ఆంధ్రజ్యోతి, వీక్లీ : 3-9-1971)

ఈ కథ హిందీ అనువాదం కేంద్ర సాహిత్య అకాడమీ '' సమకాలీన భారతీయ సాహిత్య'' లోనూ, మలయాళ అనువాదం 'కుంకుమం' పత్రికలోనూ ప్రచురితమయ్యాయి.

★ దూరదర్శన్ నేషనల్ నెట్ వర్క్‌లో '' దర్పణ్'' సిరీస్‌లో బాసు ఛటర్జీ దర్శకత్వంలో ప్రసారమైంది.